Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా వర్గాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 231 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor


అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :231 | సోమవారం 18 ఆగస్టు 2025 | వెల : 3 | పేజీలు : 4

## కశ్మీరులో మరో మేఘ విస్ఫోటం..



- విరిగిపడిన కొండచరియలు
- కథువాలో ఆకస్మిక వరదలు
- ఏడుగురి మృతి, ఐదుగురికి గాయాలు
- జోధ్ ఘాటీ గ్రామానికి ఇతర ప్రాంతాలతో రాకపోకలకు అంతరాయం

## ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్..



- ఎన్డీయే తరపున బరిలోకి
- తమిళనాడు ఓబీసీ నేతను ఎంపిక చేసిన బీజేపీ
- ఆర్ఎస్ఎస్ నేపథ్యం.. గవర్నర్‌గా విశేష అనుభవం
- ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా సీపీ బాధ్యతలు



## లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

- ఎన్డీఆర్ఎఫ్‌తో సమన్వయం చేసుకుంటూ తగినన్ని బృందాలను ముందస్తుగా అందుబాటులో ఉంచాలి
- పరిస్థితి తీవ్రతను బట్టి ఎక్కడికక్కడ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి
- ఏపీ విపత్తు నిర్వహణ, హెూంశాఖ మంత్రి అనిత

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ**

పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంపై ఏపీ విపత్తు నిర్వహణ, హెూంశాఖ మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పరిస్థితి తీవ్రతను బట్టి ఎక్కడికక్కడ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్ - మిగతా3లో

## జగన్ మైండ్ గేమ్ స్టార్ట్?

- టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నుంచి బీజేపీని దూరం చేయడానికి అవసరమైన విధంగా ఆయన అడుగులు
- సాధారణంగా పోలింగ్ లో తేడాలుంటే ఎన్నికల కమిషన్, బీజేపీపై జగన్ విమర్శలు చేయాలి
- అయితేవాటిని పక్కనపెడుతూ ఓటు చోరీ పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీపై ఆయన మండిపడుతుండటం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది.
- ఎందుకంటేరాహుల్ గాంధీ బీహార్, మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలను ప్రస్తావించారు
- కానీ, ఆంధ్రప్రదేశ్ లో 12.5 శాతం పోలింగ్ ఓట్లతో తేడా వచ్చినప్పటికీ దాని ప్రస్తావన లేకపోవడాన్ని జగన్ ప్రశ్నించారు
- చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో హాట్ లైన్ లో టచ్ లో ఉన్నారని వైఎస్ జగన్ ఆరోపించారు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, గుంటూరు**

వైసీపీ అధినేత జగన్ మైండ్ గేమ్ మొదలుపెట్టినట్లే కనపడుతుంది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నుంచి బీజేపీని దూరం చేయడానికి అవసరమైన విధంగా ఆయన అడుగులు పడుతున్నట్లే ఉంది. సాధారణంగా పోలింగ్ లో తేడాలుంటే ఎన్నికల కమిషన్, బీజేపీపై జగన్ విమర్శలు చేయాల్సి ఉంది. అయితేవాటిని పక్కనపెడుతూ ఓటు చోరీ పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీపై ఆయన మండిపడుతుండటం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఎందుకంటేరాహుల్ గాంధీ బీహార్, మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలను ప్రస్తావించారు కానీ, ఆంధ్రప్రదేశ్ లో 12.5 శాతం పోలింగ్ ఓట్లతో తేడా వచ్చినప్పటికీ దాని ప్రస్తావన లేకపోవడాన్ని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో హాట్ లైన్ లో టచ్ లో ఉన్నారని వైఎస్ జగన్ ఆరోపించారు. ఇందుకు పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకరించాని కూడా అన్నారు. దీన్ని బట్టి చూస్తే చంద్రబాబు రాహుల్ తో టచ్ లో ఉన్నారంటూ జగన్ చేసిన ప్రయత్నం రాజకీయంగా మైండ్ గేమ్ అని చెప్పాల్సి ఉంటుంది. ఎందుకంటే బీజేపీ, కాంగ్రెస్ లు రానున్న ఎన్నికల్లో తలపడుతున్న సందర్భంలో మరొకసారి చంద్రబాబుతో బీజేపీ చేతులు కలపకుండా చేయకుండా ఉండేదుకు ఈ రకమైన ఆరోపణలు - మిగతా3లో



## ఎస్ఐఆర్ అసలు రంగును బయటపెడతాం

- దేశం ఎక్కడ ఓట్ల చోరీ జరిగినా అడ్డుకుంటాం
- అన్ని రాష్ట్రాల లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగింది
- ఓటర్ల డేటాను అడిగినా ఈసీ ఇంతవరకూ ఇవ్వలేదు
- బీజేపీ నేతలు ప్రెస్‌మీట్ పెడితే ఈసీ అఫిడవిట్ అడగలేదు
- ఏఐసీసీ అగ్రనేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

## మరో 15 రోజులే ఉన్నాయి.. మా తలుపులు తెరిచే ఉంటాయి

- బీహార్ ఎస్ఐఆర్ కింద ముసాయిదా ఎన్నికల జాబితాపై ఏ రాజకీయ పార్టీకి ఎలాంటి అనుమానులు ఉన్నా తమను సంప్రదించవచ్చు
- ఎన్నికల్లో సిసీటీవీ ఫుటేజ్‌ను షేర్ చేయకపోవడానికి ఓటర్ల ప్రైవేసీని కాపాడాలన్నదే కారణం
- ఎన్నికల ముందు ఎన్నికల జాబితాను సవరించడం ఎన్నికల కమిషన్ పని




## ఢిల్లీకి మంత్రి నారా లోకేష్

### పెండింగ్ ప్రాజెక్టులపై రేపు కేంద్ర మంత్రులతో లోకేష్ భేటీలి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**



రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులపై సంబంధిత కేంద్ర మంత్రులతో చర్చించేందుకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈరోజు రాత్రి ఢిల్లీ వెళ్లనున్నారు. మంత్రి లోకేష్ సోమవారం ఈమేరకు పలువురు కేంద్రమంత్రులతో భేటీ కానున్నారు. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే పలుమార్లు కేంద్రమంత్రులతో భేటీ అయిన లోకేష్ రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. మంత్రి లోకేష్ చొరవతో రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టుల రాకతోపాటు వేగవంతంగా అనుమతులు మంజూరవుతున్నాయి. దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు దీటుగా ఆంధ్రప్రదేశ్ ను నిలిపేందుకు లోకేష్ - మిగతా3లో



## రెడ్ అలర్ట్

- ఒకవైపు భారీవర్షాలు.. మరో రెండు, మూడురోజులు ఇదే పరిస్థితి
- అల్పపీడనం ప్రభావంతో ఆదివారం రోజంతా భారీవర్షం
- వాయుగుండంగా మారనున్న అల్పపీడనం
- దక్షిణ ఒడిశా – ఉత్తరాంధ్ర మధ్య రేపు తీరం దాటే అవకాశం
- ఆ ప్రభావంతో రాష్ట్రంలో కొనసాగనున్న భారీవర్షాలు
- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు రెడ్ అలర్ట్
- తూర్పుగోదావరి, అల్లూరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు
- లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచన
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ
- ఇప్పటికే వర్షాలకు మునిగిన పంటలు.. ఆందోళనలో రైతులు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, కాకినాడ/విజయవాడ**

జిల్లాలో ఆదివారం భారీవర్షం కురుస్తూనే ఉంది. అల్పపీడన ప్రభావంతో తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా వర్షం జిల్లావాసులను వణికించింది. కొన్నిరోజులుగా వేసవిని తలపించే వాతావరణంతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. ఆకాశానికి చిల్లుపడిందన్నట్టుగా కుండపోతగా ఆదివారం సాయంత్రం వరకు వాన పడుతూనే ఉండడం విశేషం. ఉదయం నుంచి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. కాకినాడలోని శివారు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. భారీ వర్షంతో కాకినాడ నగరంలో రహదారులన్నీ జలమయమయ్యాయి. జిల్లాలో ఉదయంనుంచి సాయంత్రం 5గంట ల వరకు మొత్తం 521.6 మిల్లీమీటర్ల వర్షపా తం నమోదైంది.తొండంగిలో అత్యధికంగా 39.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్య ల్పంగా గండేపల్లిలో 10.8 సెంటీమీటర్ల వర్షపా తం నమోదైంది. కోటనందూరులో 36.8, తుని లో 36.6, పిఠాపురంలో 36.2, ఏలేశ్వరం 26.6, కొత్తపల్లి 26.6, - మిగతా3లో

## మోదీ చాలా ప్రమాదకారి.. గద్దె దింపాలి

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే
- బీజేపీని అధికారం నుంచి తొలగించేంత వరకూ ప్రజల ఓట్లు, హక్కులు, స్వేచ్ఛకు, చివరకు రాజ్యాంగానికి కూడా భద్రత లేదు
- దేశ స్వాతంత్ర్యానికి ఆర్ఎస్ఎస్ వ్యతిరేకం
- అలాంటి వ్యక్తులను ప్రధానమంత్రి ఎర్రకోట నుంచి పొడగటం ఏమిటి



## వేడుకగా రాజనాల బండ తిరునాళ్లు

# కనువిందుగా నిలిచిన ఉట్లోత్సవం



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు17:** చౌడేపల్లి మండలంలోని పెద్దకొండమర్రి గ్రామ రెవిన్యూ వెంగళపల్లి పంచాయితీ రాజనాల బండ తిరణాలు వేడు కగా జరిగాయి, సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనా ల బండ ప్రసన్న ఆంజనేయ స్వామికి తిరునాళ్లు అంటేనే ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివ స్తుంటారు. ఈనేపథ్యంలో ఆదివారం విశేషసంఖ్యలో భక్తు లు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రాజీనాల బండ భక్తులతో కికిరిసిపో యింది. చౌడేపల్లి పెద్ద కొండ మరి నుంచి గ్రామ పెద్దలు పోకమాను ఆనవాయితీగా రాజనాల బండకు తీసుకువ చ్చారు. వెంగళపల్లి పెద్ద కొండామర్రి దిగువపల్లి కొలింపల్లి తదితర ప్రాంతాల నుంచి కలశా లు బండకు చేరుకున్నాయి అనంతరం నాలుగు గ్రామాల నుంచి దేవరెద్దులు పాత గోబల వారి పల్లికి చేరుకున్నాయి, అక్కడ విశేష పూజలు అనంతరం దేవరెద్దులను బండ పైకి తీసుకొచ్చా రు. అదేవిధంగా బోయకొండ గంగమ్మ జన్మస్థలమైన కొలింపల్లి నుంచి బండకు చేరుకొని తిరుణాలను సూక్ష్మ రూపంలో దర్శించుకున్నారు. టిటిడి ఆధ్వర్యంలో రాజనాలబండపై పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయాన్నే ప్రసన్న ఆంజనేయ స్వామికి ప్రధానార్చకుడు కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు అలంకరణ నిర్వహించారు టిటిడి ఆధ్వర్యంలో రాజనాల బండ విద్యుత్ దీపాలతో దివ్యాంగ సుందరంగా అలంకరించారు. ముఖ్యంగా రాజనాల బండ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉట్లోత్సవం తిరుణాలకే హైలెట్గా నిలిచింది పోకమాను బరి గిన అనంతరం ఉట్లు కొట్టడాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసక్తిగా తిలకించారు అదేవిధంగా ఉట్లోత్సవాన్ని యువకులందరూ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారు లు పర్యవేక్షించారు. ఎస్సై నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# నేడు జనసేన పార్టీ ఆధ్వర్యంలో జండా ఆవిష్కరణ



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు17:** జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 18న జండా ఆవి ష్కరణ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షు డు గందోడి చరణ్ రాయల్ తెలిపారు. నియోజకవర్గ నాయకుడు సోమశేఖర్ రాయల్ ఆధ్వర్యంలో కల్లూ రు సదుం సోమల చౌడేపల్లి పుంగనూరు పట్టణాల్లో జండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీకిచెందిన నాయకులు వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయనకోరారు.

## వినాయక చవితి సందర్భంగా

# యువతకు సిఐ యుగంధర్ సూచనలు



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 17:** అన్నమయ్యజిల్లా పీలేరు వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పీలేరు అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ యుగంధర్ ఆదివారం స్థానిక సిఐ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. వినా యక చవితి ఉత్సవాలు, అనంతరం జరిగే వినాయక నిమజ్జనం సమయంలో యువత ఎటువంటి అసాం ఘిక, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడకూడదని, ఉత్సవా లను శాంతి యుతంగా, ఆనందంగా జరుపుకోవ డంలో ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఏదైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే యువత తమ భవిష్యత్తు పాడుచేసుకునే పరిస్థితి వస్తుం ది. ఒక చిన్న తప్పు వారి కెరీర్ మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది. కాబట్టి వినాయక ఉత్సవాలు క్రమశిక్షణగా, సమాజానికి ఆదర్శంగా నిలిచేలా నిర్వహించాలి" అని తెలిపారు. ఈ కార్యక్ర మంలో సిఐ యుగంధర్‌తో ఎస్ఐ లోకేశ్ పాల్గొన్నారు.

# ఎమ్మార్వో ఆఫీస్,బీసీ హాస్టల్ పోయే దారికి మోక్షం ఎప్పుడు





**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు17 :** రేణిగుంట మండల పరిధిలోని తహ సీల్దార్ కార్యాలయం, బీసీ హాస్టల్‌కు వెళ్ళడానికి రోడ్డు గుంతల గుంతలు గా ఉండటంతో అటు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు గాని, ఇటు బీసీ హాస్టల్‌కు వెళ్లే పిల్లలుగాని తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతం లో ఈ సమస్య గురించి వామ పక్ష పార్టీ నాయకులు అధికారులను విన్నవించుకున్న ఎటువంటి పరిష్కారం లేకుండా పోయింది. కొద్దిపాటి వర్షానికే రొడ్డంతా బుడద మయం అయ్యి రాకపోకలు జరపడం కష్టతరం అవుతుంది. నిజంగా సంభందించిన అధికారులు ఈ సమస్యను చూస్తున్నారా లేక చూసి చూడ నట్లు గాలికి వదిలేస్తున్నారా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.దయచేసి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దీనిపై స్పందించి త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తారని ప్రజలు, విద్యార్థులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

# మాట చెప్పాం... చేసి చూపాం

**ఏడాదిలో సూపర్ సిక్స్.. సూపర్ హిట్ చేశాం**

**రాష్ట్రానికి ఆదాయ మార్గాలు అన్వేషిస్తూ.. సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి**

**వైకాపా చేసిన తప్పుడు కార్యక్రమాల సరిదిద్దేందుకే సమయం సరిపోతోంది**

**చిత్తశుద్ధితో పని చేసి చెప్పిన పనులన్నీ పూర్తి చేస్తాం**

**పలమనేరులో ఎమ్మెల్యే అమర్ ఆధ్వర్యంలో రైతుల భారీ ట్రాక్టర్ ర్యాలీ**

**రైతు సంబర సభలో ప్రశంగించిన ఎమ్మెల్యే**

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు17:** రాష్ట్రంలో అధికారంలో ఉన్నకుటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పిన హామీలను ఏడాదిలోనే చేసి చూపామని పల మనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డి పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా పలమనేరులో ఆదివారం నియోజకవర్గంలోని రైతులు భారీట్రాక్టర్ ర్యాలీ నిర్వహించా రు. పట్టణంలోని పెద్ద చెరువు నుంచి మార్కెట్ యార్డ్ వరకు వందలాదిమంది రైతులు ట్రాక్టర్లతో ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం మార్కెట్ యార్డ్ ఆవరణలో నిర్వహించిన రైతు సంబరాల సభలో ఆయన ప్రసంగించారు. ఎన్నికలకు ముం దు ఇచ్చిన హామీని నెరవేర్చి రైతులతో మమేకం కావడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించమన్నారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. అందులో భాగంగా పింఛన్లకు సం బంధించి చెప్పిన మాట ప్రకారం నాలుగు వేలకు పెంచడమే కాక అధికారం చేపట్టిన వెంటనే అమలు చేశామన్నారు. గత ప్రభుత్వంలో ఒక్కబిడ్డకే అమ్మ ఒడి ఇస్తే ఈ ప్రభుత్వంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇచ్చిమాట నిలబెట్టుకున్నామన్నారు. రైతు భరోసా కింద గతం



లో 14వెలు ఇస్తే ఈ ప్రభుత్వం 20వెలు ఇస్తున్నామన్నారు. మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఈనెల 15న ఉచిత బస్సు అమలు చేసి చూపామని తెలిపారు. 2019-24లో జగన్ ప్రభుత్వం చేసిన అరాచకాలు అవినీతితో రాష్ట్రం అదా పాతా ళానికి తొక్కడంతో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభు త్వం రాష్ట్రాన్ని మళ్లీ గాడీలో పెట్టి కార్యక్రమాలు చేయడానికి ఏడాది పట్టిందని వివరించారు. ఏడాది కాలంలో రైతులకు ఇబ్బందికరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ని రద్దు పరిచామని, మెగా డీఎస్సీ తదితరాలను అమలు చేశామని గుర్తు చేసారు. పలమనేరులో రైతుల కోసం 33 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ సదుపాయాన్ని కల్పించనున్నామన్నా రు. ఇక మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. గతంలో జగన్ ప్రభుత్వం రైతులను ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదని మూర డ్రిప్ పైపు కూడా ఇవ్వలేదన్నారు. గతంలో రైతుల సంక్షేమం కోసం హంద్రీనీవా ద్వారా నీళ్లు తీసుకొస్తే ఎన్నికలకు ముందు జగన్ స్టంట్స్ చేసి చూపించి రైతుల పట్ల తనకున్న చిత్తశుద్ధిని ప్రదర్శించారని విమర్శించారు. నేడు 2వేల కోట్లతో హంద్రీనీ వా, గాలేరు- నగరి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని జగన్ భయానక వాతావరణం లోకి నెట్టేయడంతో పెట్టుబడిదారులు పారిపోయే పరిస్థితి ఏర్పడిందని మళ్ళీ జగన్‌ను రానివ్వకుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏదేమైనా గత ప్రభుత్వం చేసిన తప్పుడు కార్యక్రమాలు సరిది ద్దేందుకే సమయం సరిపోతున్నదన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో చెప్పిన కార్యక్రమాలన్నీ చేశామని చిత్తశు ద్ధితో మాట ప్రకారం పని చేస్తూ సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు ఆర్వి బాలాజీ, రామచంద్ర నాయుడు, విష్ణువర్ధన్ రెడ్డి మరియు మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడ, సోమశేఖర్ గౌడ్, ఆనంద, నాగరాజు రెడ్డి, ఆర్.బి.సి కుట్టి, బిజెపి అధ్యక్షుడు విజయ్ జనసేన నాయకులు దిలీప్ లతో పాటు నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఇక జియో పొలిటికల్ షిఫ్ట్

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు అంటూ ఉండరంటారు కదా.. అయితే ఇది కొన్ని సందర్భాల్లో దేశాలకూ వర్తిస్తుంటుంది. ప్రత్యర్థిగా భావిస్తున్న దేశాలతోనే జట్టుకట్టే పరిస్థితి ఉండొచ్చు. ఇప్పుడు భారత్ ? చైనా బంధం చూస్తుంటే ఇదే నిజమనిపిస్తోంది. ఓవైపు ట్రంప్ దూకుడు భారత్, చైనాకు చాలానే కలిసి వస్తోంది. జియోపొలిటికల్ షిఫ్ట్ అనేది ఒకటి ఉంటుంది. ట్రంప్ కారణంగా ఇది వర్కవుట్ అవుతోంది.భారత్ చైనా మధ్య స్నేహబంధం. ఒక నమ్మకం సరికొత్త బంధానికి పునాది వేస్తుంది. ఒక అవకాశం.. సత్సంబంధాలను పెంచుతుంది. ఒక అవసరం కలిసి నడిచేలా చేస్తుంది. ఇది ఇప్పుడు భారత్ చైనాకు వర్తిస్తుంది. ఎందుకంటే 2020లో గాల్వన్ లోయలో ఘర్షణ తర్వాత కథ అంతా మారిపోయింది. దూరం పెరిగింది. అయితే ఆ దూరం ఎప్పుడూ అలాగే ఉండదు కదా. ఇటీవలి పరిస్థితులు కలిసి వచ్చాయి. రెండు దేశాల మధ్య మళ్లీ కొత్తబంధం చిగురించేలా చేశాయి. భారత ఉత్పత్తులపై ట్రంప్ 50 శాతం టారిఫ్ లు విధించిన తర్వాత ఈ రెండు దేశాలు దగ్గరవుతున్నాయని ఇప్పుడు అనుకుంటున్నారు. అయితే మార్చిలో చైనాపై 20 శాతం ట్రంప్ టారిఫ్‌లు విధించినప్పుడే చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీూ కలిసి నడుద్దామని పిలుపునిచ్చారు. అమెరికా ఓవరాక్షన్‌కు చెక్ పెట్టేందుకు, పవర్ పాలిటిక్స్‌ను అడ్డుకునేందుకు కలిసి పని చేద్దామన్నారు. అప్పటి నుంచే భారత్ ? చైనా మధ్య పరిస్థితులు అనుకూలిం చడం మొదలైంది. చెప్పాలంటే మొదట ఒక మెట్టు చైనానే దిగింది. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి రాక. ఆగస్ట్ 18న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఢిల్లీకి వస్తున్నారు. జాతీయ భద్రతా సలహాదారు దోవల్ తో భేటీ అవుతారు. ఈనెల 31న ప్రధాని మోడీ చైనా పర్యటన కంటే ముందుగానే ఈ పరిణామం చోటు చేసుకుంటుండడం ఆసక్తికరంగా మారుతోంది. ఎందుకంటే మాట్లాడుకునేవి చాలా ఉన్నాయి. పరిష్కరించుకునేవీ ఉన్నాయి. సో ఇటీవలి కాలంలో భారత్ చైనా ప్రతినిధులు, ప్రభుత్వ వర్గాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తున్నాయి. రాజకీయంగా పరస్పర విశ్వాసం పెంచుకోవ డం, సహకారాన్ని విస్తరించడం ఇవన్నీ రెండు దేశాల మధ్య బంధాన్ని మరో లెవెల్ కు తీసుకెళ్లేలా కనిపిస్తున్నాయి ట్రంప్ టారిఫ్ లకు చెక్ పెడుదామని చైనా ముందుకు రావడం, ప్రధాని మోడీ ఏడేళ్ల తర్వాత చైనాకు వెళ్లాలని డిసైడ్ అవడం, సరిహద్దు వాణిజ్యం మళ్లీ ప్రారంభించాలని అనుకోవడం, బార్డర్ లో పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించడం, డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభించాలనుకోవడం, చైనీస్ పౌరు లకు టూరిస్టుల వీసాల మంజూరుపై ముందడుగు పడడం, చైనా కంపెనీల పెట్టుబడుల నిబంధనలను సడలించాలను కోవడం ఇవన్నీ కీలక పరిణామాలుగా కనిపిస్తున్నాయ్. సరిహ ద్దు వాణిజ్యం మళ్లీ మొదలు పెట్టేలా చర్చలు. ఓవరాల్‌గా చూస్తే భారత్ చైనా మధ్య సరిహద్దు వాణిజ్యం, ద్వైపాక్షిక సంబంధాల్లో మెరుగుదల కనిపిస్తోంది. ముఖ్యంగా 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఏర్పడిన ఉద్రిక్తతల నుంచి రిలీఫ్ కనిపిస్తోంది. ఈ సంబంధాలు పెరగడంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలు, భారత్‌పై విధించిన అధిక టారిఫ్ లు కీలకంగా మారాయి. ఫస్ట్.. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత నిలిపేసిన సరిహద్దు వాణిజ్యాన్ని పునఃప్రారంభించేందుకు చర్చలు జరుగుతున్నాయి. ఈ ట్రేడ్ ఉత్తరాఖండ్ లిపులేఖ్ పాస్, హిమాచల్ ప్రదేశ్ షిప్కీ లా పాస్, అలాగే సిక్కిం నాథు లా పాస్ ఇలా మూడు హిమాలయన్ సరిహద్దుల ద్వారా జరుగుతుంది. ఈ సరిహద్దు వాణిజ్యం విలువలో చిన్నదైనప్పటికీ రెండు దేశాల మధ్య సామాజిక ఆర్థిక సంబంధాలను మెరుగుపరచడంలో కీ సిగ్నల్ గా ఉంది. సో ఇది త్వరలో ప్రారంభించాలనుకోవడంపై చైనా రియాక్ట్ అయింది. ఈ వాణిజ్యంతో సరిహద్దు ప్రాంత వాసుల లైఫ్ క్వాలిటీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నది చైనా. 2020కి ముందున్న పెట్రోలింగ్ విధానం పునరుద్ధరణ. భారత్ చైనా మధ్య దౌత్యపరమైన పురోగతి కూడా కనిపిస్తోంది. 2024 అక్టోబర్‌లో కుదిరిన ఒప్పందంతో 2020కి ముందు ఉన్న పెట్రోలింగ్ విధానాన్ని పునరుద్ధరించారు. ఐదేళ్ల తర్వాత ఇదొక కీలక ముందడుగుగా మారింది. అటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 31న షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ ? ఎాఅూ సమ్మిట్ కోసం చైనాకు వెళ్లనున్నారు. ఏడేళ్ల తర్వాత చైనా పర్యటనకు మోడీ వెళ్తుండడం ఇదే తొలిసారి. ఈ టైంలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భేటీ జరగనుంది. అటు 2020 నుండి నిలిపేసిన డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసులు తిరిగి ప్రారంభం కానున్నాయి. రెడీగా ఉండాలని విమానయాన సంస్థలకు కేంద్రం సూచించింది కూడా. చైనాతో భారత్‌కు 85 బి. డాలర్ల వాణిజ్య లోటు. సో ఈ ప్రయత్నాలన్నీ ఆర్థిక దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో కీలక ముందడుగుగా మారుతాయి. వాణిజ్యం, చర్చలను తిరిగి ప్రారంభించడం ద్వారా రెండు దేశాలు ఉద్రిక్తతలను తగ్గించడానికి సహకారాన్ని పెంచుకోవడానికి ఉపయోగపడనున్నాయి. అటు వాణిజ్య బంధంపైనా ఫోకస్ పెడుతున్నాయి. 2023-24లో భారత్‌కు చైనా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ద్వైపాక్షిక వాణిజ్యం 118.4 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అయితే ఇండియా 85 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును ఎదుర్కొంటోంది. దీనిని తగ్గించేందుకు చైనాలో మన మెడిసిన్స్, అలాగే వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ యాక్సెస్‌ను పెంచాలని భారత్ కోరుతోంది. సో రాబోయే రోజుల్లో అన్నీ జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా అమెరికాను ఎదుర్కోవడం చైనాకు కీలకం. అందుకు భారత్ సపోర్ట్ కావాలి. అదే సమయంలో మన ప్రాధాన్యతలకు మనకు ఉన్నాయి. అయితే చైనాను పూర్తిగా నమ్మకుండాజాగ్రత్తగా వ్యవహరించడమే కీలకమైన విషయం. ట్రంప్ టారిఫ్‌లతో మారిన కథ. కొన్ని అవకాశాలు ఆటోమే టిక్‌గా కలిసి వస్తాయి. ఇప్పుడు భారత్ చైనా సంబంధాల



మెరుగువడంలో కూడా చాలానే కలిసి వచ్చాయి. ఈ రెండు దేశాల దౌత్య సంబంధాలకు ఈ ఏప్రిల్ లో 75 ఏళ్లు పూర్త య్యాయి. ఆ సందర్భంగా చైనా అధ్యక్షుడు, భారత రాష్ట్రపతి పరస్పర అభినందనలు తెలుపుకోవడం దగ్గర్నుంచి ఇప్పుడు స్ట్రాటజిక్ రీ సెట్ దాకా చాలా పరిణామాలు జరుగుతున్నాయ్. రష్యా నుంచి ఆయిల్, ఆయుధాలు కొనడం ఆపకపోతే భారత్ పై 50 శాతం టారిఫ్‌లు వేస్తానని ట్రంప్ ప్రకటించిన తర్వాత కథ మారింది. ఇది భారత్ అమెరికా సంబంధాలపై చాలా ఎఫెక్ట్ చూపింది. ఓవైపు పాకిస్తాన్‌ను అమెరికా దగ్గర తీస్తోం ది. ఇటు భారత్ చైనా మధ్య పొలిటికల్ షిఫ్ట్ కనిపిస్తోంది. చైనాపై 20 శాతం సుంకాలు, భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు ట్రంప్. దీంతో ఈ రెండు దేశాలు అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టే దిశగా కదులుతున్నాయి. తాజాగా ప్రధాని మోడీ ఇండిపెండెన్స్ డే స్పీచ్ లోనూ మనం ప్రపంచ మార్కెట్లలో మన సత్తా చాటుకోవాల్సిన టైం వచ్చిందని గుర్తు చేశారు. భారత్? చైనా వాణిజ్య సంబంధాల మెరుగుదల. ట్రంప్ అమెరికా ఫస్ట్ అన్న విధానం అలాగే అధిక సుంకాలు భారత్ ? చైనా మధ్య వాణిజ్య సంబంధాలు పెరగడంలో కీలక పాత్ర పోషించింది. సో తమ ఉత్పత్తులకు అమెరికా చెక్ పెడితే.. భారత్ మాత్రం అన్ని ప్రత్యామ్నాయ ఆప్షన్లు చూస్తోంది. అందుకే డైవర్సిఫి కేషన్ రూల్ ఫాలో అవుతోంది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడికి ఉత్పత్తుల్ని షిఫ్ట్ చేసే ప్రయ త్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగానే చైనాతో వాణిజ్య బంధంపై ముందడుగు వేస్తోంది. చైనీస్ పెట్టుబడుల పై ఆంక్షలను సడలించడం, వాణిజ్య మార్గాలను తెలవడం వంటి చర్యలకు ఓకే చెబుతోంది. క్లియర్‌గా చెప్పాలంటేట్రంప్ విధానాలు భారత్-చైనా సంబంధాలను స్ట్రాటజిక్ రీసెట్ వైపు నడిపిస్తున్నాయి. భారత్ అమెరికాతో బలమైన సంబంధాలను కొనసాగిస్తూనే, చైనాతో ఆర్థిక సహకారాన్ని పెంచడం ద్వారా ప్రపంచంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని చూస్తోం ది. అందుకే ఇవన్నీ జరుగుతున్నాయి. అంతకు ముందు కైలాస శిఖర దర్శన, మానస సరోవర యాత్రకు అడ్డంకులు తొలగించారు.

# సమస్యలు తలెత్తకుండా గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి

## అర్బన్ సీఐ జయచంద్ర



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగష్టు 17 :** రేణిగుంట మండల పరిధిలోని వినాయక విగ్ర హాల మండప నిర్వాహకులతో సీఐ జయచంద్ర ఆదివారం ప్రేత్యేక సమావేశం నిర్వహించారు. గణేష్ నవరాత్రులను శాంతియుతంగా జరిపేం దుకు తగు సూచనలు చేసారు. సౌండ్‌కి సంభం చిన పరికరాలను పరిమితంగా ఉపయోగించాల ని, మద్యం సేవించి ఉన్న వాళ్ళను అనుమ తించకూడదని అన్నారు. అదేవిదంగా ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. మహిళలు,పిల్లల భద్రత కు ప్రాధాన్యత ఇవ్వాలని,ఏవైనా సమస్యలు తలెత్తితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

## బొమ్మయపల్లి పంచాయతీని

# ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా.. సర్పంచ్ గోవింద్



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఆగస్ట్ 17:** బొమ్మయపల్లి పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దు తానని బొమ్మయపల్లి సర్పంచ్ గోవింద్ అన్నారు బొమ్మ యపల్లి పంచాయతీ రామకృష్ణాపురం గ్రామం పంచాయ తీలోనూ పలు గ్రామాలకు సుమారు 75 కొత్త వీధి దీపాలు సర్పంచ్ గోవింద్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా సర్పంచ్ గోవింద్ మాట్లాడుతూ బొమ్మయపల్లి పంచాయతీలో అన్ని గ్రామాలు ప్రజలు రాత్రి వేళల్లో గ్రామస్తులు బాటసారిలో ఇబ్బంది, లేకుండా పంచాయ తీలో ఉండాలని రాత్రి వేళలో ఎలాంటి ఇబ్బంది, ప్రజలకు కలవకూడదని వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరిగిం దని తెలిపారు. పంచాయతీ నిధులతోనే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశానని తెలిపారు. బొమ్మయపల్లి పంచాయతీలో ప్రజలకు అవసరం వచ్చిన ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరి స్తానని తెలిపారు. అలాగే కొత్త విద్యుత్ దిపాలు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు సర్పంచ్ గోవిందుకు అభినందనలు తెలిపారు.

# రెడ్ అలర్ట్



-మొదటిపేజీ తరువాయి

కాకినాడ రూరల్ 26.2, సామర్లకోట 25.4, ప్రత్తిపాడు 24.2, గొల్లప్రోలు 24.2, రౌతులపూడి 24.2, తాళ్లరేవు 23.2, కాకినాడ అర్బన్ 23.2, కాజులూరు 22.8, శంఖవరం 22.0, కిర్లంపూడి 21.4, కరప 21.2, పెద్దాపురం 19.2, పెదపూడి 17.2, జగ్గంపేట 14.2 సెం టీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అల్పపీడన ప్రభావంతో మరో మూడురోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉండడంతో కాకినాడ పోర్టులో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. మరికొన్ని రోజులపాటు కొ నసాగించనున్నట్టు విశాఖ తుపాను హెచ్చరిక ల కేంద్రం అధికారులు తెలిపారు. మత్స్యకారు లు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని సూచించారు. మరోవైపు ఈ వర్షాలు వ్యవసాయ పనులకు ఉపయోగకరంగా ఉంటాయని రైతు లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### నేడు ఒకటి, 23న మరొకటి

దక్షిణ ఒడిశా–ఉత్తరాంధ్ర పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాబోయే మూడురోజుల్లో కోస్తా జిల్లాలో కొన్ని చోట్ల భారీనుంచి అతిభారీవర్షాలు కురిసే ప్రమా దం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం పే ర్కొంది. వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సోమవారం మరో అల్పపీడనం ఏర్పడొ చ్చని వాతావరణశాఖ వెల్లడించింది. ఈనెల 23న బంగాళాఖాతంలో ఇంకో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు నెలలో భారీ వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయి.

### ప్రజలు అప్రమత్తంగా ఉండండి

అల్పపీడనం వాయువ్య దిశలో వాయుగుండంగా మారే అవకాశం ఉన్నందున వచ్చే 24 గంటల్లో కాకినాడ జిల్లాలో భారీ నుంచి అతి భా రీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరిక జారీ చేశారు. ప్రజలంతా ఇళ్లల్లోనే సురక్షితంగా ఉం డాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోను ప్రజ లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను వాగులు, వంకలు వంటివి దాటే ప్రయ త్నం చేయవద్దన్నారు.

భారీవర్షాల నేపథ్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్లో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)ను రద్దు చేసినట్టు కలెక్టర్ షాన్‌మోహన్ ప్రకటించారు. కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలోనూ పీజీఆర్ఎస్‌ను రద్దు చేశామని కార్పొరేషన్ కమిషనర్ భావన తెలిపారు.

### జిల్లా పోలీస్ కార్యాలయంలోనూ..

జిల్లాలో ఈరెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈనెల 18వతేదీ సోమవారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను రద్దు చేశామని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం జిల్లాలో ఎడతెరిపిలేకుండా వర్షం కురి సింది. దీంతో ప్రజాజీవనం స్తంభించింది. వ్యాపారసంస్థలు మూతబడ్డాయి. భారీవర్షంతో జిల్లావ్యాప్తంగా వరిపొలాలు నీట మునిగి అన్నదాతలకు ఇబ్బందులు మొదలయ్యాయి. దీనికితోడు పలుచోట్ల ప్రధానమైన డ్రైన్లతోపాటు మైనరు డ్రైన్లు వర్షపునీటితో నిండి పొంగి ప్రవహించడంవల్ల పంటపొలాల్లో వర్షపునీరు దిగే మార్గం లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

### కంట్రోల్ రూముల ద్వారా సమీక్ష

రెండురోజులపాటు జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని కలెక్టర్ మహేష్‌కుమార్ హెచ్చరిక జారీ చేయడంతోపాటు కలెక్టరేట్ సహా ఆర్డీవోలు, తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. దీనికితోడు గోదావరిలో కూడా వరద నీటి మట్టం పెరుగుతోంది. లంక ప్రాంతాల్లోకి వరద ప్రవాహం చొచ్చుకు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఆదివారం నాటి వర్ష ప్రభావంవల్ల జిల్లావ్యాప్తంగా అధికారులు ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులపై సమీక్షించారు. కొన్నిచోట్ల తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అప్రమత్తమయ్యారు. ఇరిగేషన్, డ్రైన్స్, రెవెన్యూ సహా ప్రభుత్వశాఖల ఉద్యోగులు వర్ష ప్రభావ ప్రాంతాల్లో పర్యటించారు. వర్షాలతో జిల్లావ్యాప్తంగా పంట పొలాలు మునగడంతో ఇబ్బందులను పరిశీలించి చేలల్లో ఉన్న ముంపును బయటికి పంపించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే పనిలో నిమగ్నమయ్యారు. కోనసీమలోని కొన్ని మండలాల్లో పంటచేలు మరోసారి ముంపునకు గురికావడంవల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ ప్రారంభ దశలోనే పంట పొలాల ముంపుతో తీవ్రమైన నష్టాలను కలగజేస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయల్లో వరద ప్రవాహం పెరుగుతోంది. మహారాష్ట్రలో భారీవర్షాలవల్ల గోదావరినదికి వరదలు తీవ్రస్థాయిలో పోటెత్తుతాయని జలవనరులశాఖ నిపుణుల అంచనాలతో ప్రజలు, అధికారులు అప్రమత్తమవుతున్నారు.

### మరో అల్పపీడనం

బంగాళాఖాతంలో ఈనెల 18, 23 తేదీల్లో అల్పపీడనాలు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ చేసిన హెచ్చరికలతో కోస్తా ఆంధ్ర పరిధిలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్నిచోట్ల భారీనుంచి అతిభారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ఈనెల 18, 19 తేదీల్లో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరించింది. దీంతో మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి.

# చేపలు సరే... తిమింగలాల సంగతేంటీ



**ఒంగోలు :** ఆర్జీవీ.. అలియాస్ రామ్‌గోపాల్ వర్మ.. తెలుగు ప్రజలకే కాదు.. బాలీవుడ్ అభిమానులకు సుపరిచితమైన పేరు. ముఖ్యంగా 2019 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో తెరవెనుక రాజకీయాలు చేస్తున్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడానికి తనవంత సహకారం అందించారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు రామ్‌గోపాల్‌వర్మ సైలెంట్ అయ్యారు. కానీ గతంలో చేసిన వ్యాఖ్యలపై కేసులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఒంగోలు పోలీస్ స్టేషన్‌కు విచారణకు కోసం వచ్చారు. చిన్న నాయకులపై చర్యలు తీసుకుంటూ, పెద్ద నాయకులను వదిలేస్తున్న ఈ వ్యవహారం ప్రజల్లో అనుమానాలు రేకెత్తిస్తోందని పేర్కొన్నారు.రామ్ గోపాల్ వర్మ ఒంగోలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరైన సంఘటన రాజకీయ కోణం నుంచి చర్చనీయాంశమైంది. వైసీపీ హయాంలో ఆయన టీడీపీ నాయకులైన చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్‌లపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు, మార్ఫింగ్ చిత్రాలు పెట్టారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. 'వ్యూహం' సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఈ చర్యలు రాజకీయంగా ప్రేరేపితమని టీడీపీ నాయకుడు ముత్తనపల్లి రామలింగం ఫిర్యాదు చేశారు. ఆర్జీవీ ముందస్తు బెయిల్ పొందినప్పటికీ, హైకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరయ్యారు. అయితే, ఈ కేసు న్యాయపరమైన చర్య కన్నా రాజకీయ కక్ష సాధింపుగా పరిగణించబడుతోంది. వైసీపీ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో ఆర్జీవీ సమావేశం కావడం ఈ అనుమానాలను మరింత బలపరిచింది.మద్యం కుంభకోణం కేసులో సిట్ ఇటీవల దాఖలు చేసిన అనుబంధ ఛార్జ్‌షీట్‌లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రధాన సూత్రధారిగా పేర్కొనడం గమనార్హం. అయితే, ఈ కేసులో ఇప్పటివరకు జగన్‌కు నోటీసులు జారీ కాలేదు, విచారణకు హాజరయ్యే అవకాశం కూడా అస్పష్టంగా ఉంది. ఈ విషయంలో వైఎస్ షర్మిల స్వయంగా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం గమనార్హం. 'చిన్న నాయకులను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు, బెయిల్‌లతో సమయం వృథా చేస్తున్నారు, కానీ ప్రధాన నిందితులపై చర్యలు లేవు. ఈ కేసు రాజకీయ ఒత్తిడి కారణంగా నీరసించినట్లు కనిపిస్తోంది, ఇది ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తోంది అని పేర్కొన్నారు.వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అవినాష్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వివేకా కుమార్తె సునీతా రెడ్డి నిరంతరం పోరాటం సాగిస్తున్నారు. ఢిల్లీ నుంచి కడప వరకు ఆమె అధికారులను కలుస్తూ, న్యాయం కోసం కృషి చేస్తున్నారు. అయితే, ఈ కేసులో గణనీయమైన పురోగతి కనిపించడం లేదు. అవినాష్ రెడ్డిపై ఆరోపణలు ఉన్నప్పటికీ, రాజకీయ ప్రభావం కారణంగా ఈ కేసు నెమ్మదిగా సాగుతున్నట్లు భావిస్తున్నారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోందనే విమర్శలు వస్తున్నాయి.మిథున్ రెడ్డి, చెవిరెడ్డి వంటి వైసీపీ నాయకులపై అరెస్టులు, విచారణలు జరుగుతున్నప్పటికీ, వారు త్వరలోనే బెయిల్‌పై విడుదలవుతున్నారు. ఇది న్యాయవ్యవస్థ పరిమితులను సూచిస్తుంది. పెద్ద నాయకులైన జగన్, అవినాష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవడంలో కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ పరిస్థితి ప్రజల్లో 'చిన్న చేపలను వేటాడుతూ, తిమింగలాలను వదిలేస్తున్నారు' అనే అభిప్రాయాన్ని కలిగిస్తోంది. రాజకీయ ఒత్తిడి, శక్తివంతమైన నాయకుల ప్రభావం వల్ల న్యాయం అమలులో ఆటంకాలు ఏర్పడుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.కూటమి ప్రభుత్వానికి మిగిలిన మూడేళ్ల కాలంలో ఈ కేసుల్లో పెద్ద నాయకులపై చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందా? మద్యం కుంభకోణం, వివేకా హత్య కేసుల్లో ప్రధాన నిందితులను విచారణకు రప్పించడం, న్యాయం అమలు చేయడం పెద్ద సవాలుగా కనిపిస్తోంది. సిట్, పోలీసు విభాగాలు 'బిగ్ బాస్'ల వరకు చేరుకోవడానికి సమర్థవంతమైన వ్యూహాలు రూపొందించాల్సి ఉంది. లేకపోతే, ఈ కేసులు కేవలం మీడియా హైప్‌గా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

## తమిళనాడులో తారాస్థాయికి భాష రగడ

**చెన్నై :** మనదేశంలో రాజకీయ నాయకులు మాత్రమే కాదు గవర్నర్లకు కూడా రాజకీయ వాసనలు ఉంటాయి. గవర్నర్లను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. రాష్ట్రాలలో జరుగుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు తమకు నివేదికల ద్వారా తెలియజేయాలని సూచిస్తుంది. అయితే గవర్నర్లు కొన్ని సందర్భాలలో తమ పరిధులు దాటుతుంటారు. రాష్ట్రానికి ప్రధాన పౌరులం అనే విషయాన్ని మర్చిపోయి.. రాజకీయాలలో వేలు పెడుతుంటారు. దీంతో పరిస్థితులు ఒక్కసారిగా చేయు దాటిపోతుంటాయి. గతంలో తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్, తమిళ సై సౌందరరాజన్ మధ్య కొద్ది రోజులపాటు ఇటువంటి పరిణామాలు జరిగాయి. ఇప్పుడు తమిళనాడులో కూడా అటువంటి పరిస్థితులు నెలకొన్నాయి.తమిళనాడు రాష్ట్రంలో డిఎంకె పార్టీ అధికారంలో ఉంది. స్టాలిన్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఆ రాష్ట్రంలో ఆర్ఎన్ రవి గవర్నర్ గా కొనసాగుతున్నారు. రవి తమిళ భాషను వ్యతిరేకిస్తారని ఆ రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా డీఎంకే కార్యకర్తలు తీవ్రస్థాయిలో విమర్శిస్తుంటారు. అంతేకాదు ఆయన సమయం దొరికిన ప్రతి సందర్భంలోనూ హిందీ లేదా ఇంగ్లీషులోనే ప్రసంగిస్తుంటారు. సహజంగానే మాతృభాష మీద విపరీతమైన ప్రేమ ఉండే తమిళులు గవర్నర్ వైఖరిని విపరీతంగా విమర్శిస్తుంటారు. సోషల్ మీడియాలో అయితే గవర్నర్ రవిని ఏకిపారేస్తుంటారు. కొంతకాలంగా గవర్నర్, డీఎంకే ప్రభుత్వానికి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. నీట్ కు వ్యతిరేకంగా డీఎంకే ప్రభుత్వం ఒక తీర్మానం చేసినప్పుడు.. దానిని గవర్నర్ వ్యతిరేకించారు. అప్పట్లో ఇది తమిళనాడు రాష్ట్రంలో సంచలనం సృష్టించింది.తాజాగా ఆ రాష్ట్ర ప్రథమ పౌరుడికి ఓ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో చేదు అనుభవం ఎదురయింది..

## ఢిల్లీకి మంత్రి నారా లోకేష్

-మొదటిపేజీ తరువాయి

ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. రేపటి పర్యటనలో రాష్ట్రానికి ఇటీవల సెమీకండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్వనీ వైష్టవ్ కు మంత్రి లోకేష్ కృతజ్ఞతలు చెబుతారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర రోడ్డురవాణా, రహదార్ల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి, ఓడరేవులు, జలరవాణాశాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తో మంత్రి లోకేష్ సమావేశమవుతారు. ఈ సందర్భంగా రాష్ట్రప్రభుత్వం తరపున వివిధ ప్రతిపాదనలను కేంద్రమంత్రులకు అందజేస్తారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

-మొదటిపేజీ తరువాయి

సిబ్బంది పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్డీఆర్ఎఫ్‌తో సమన్వయం చేసుకుంటూ తగినన్ని బృందాలను ముందస్తుగా అందుబాటులో ఉంచాలని దిశానిర్దేశం చేశారు. కొండ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేస్తూ.. ముందస్తు హెచ్చరికల ఆధారంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని స్పష్టం చేశారు.

## జగన్ మైండ్ గేమ్ స్టార్ట్?

-మొదటిపేజీ తరువాయి

చేస్తున్నట్లు టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే పార్టీ వ్యవహారాల ఇన్ ఛార్జి మాణికం ఠాగూర్ పై కడా జగన్ విమర్శలు చేశారు.. మాణికం ఠాకూర్ చంద్రబాబు నాయుడును విమర్శించడం లేదని, ఆయన ప్రభుత్వంలో జరిగే అవినీతిని ఎత్తి చూపడం లేదని, ఏపీలో అధికారంలో ఉన్న పార్టీని వదిలేసి ప్రతిపక్షంలో ఉన్న తమపై విమర్శలు చేయడమంటే లోపాయి కారీ ఒప్పందం ఏమిటో అర్థమవుతుందని వైఎస్ జగన్ వ్యాఖ్యానించడం రాజకీయ ఎత్తుగడల్లో ఒక భాగమేనంటున్నారు. బీజేపీతో చంద్రబాబును దూరం చేస్తే తప్ప తనకు తిరిగి అధికారం దక్కదని భావించిన జగన్ ఇక ఇటీవల ఈ తరహా రాజకీయం మొదలుపెట్టారని టీడీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. గతంలో తెలంగాణలో కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకుని రాహుల్ గాంధీతో ప్రచారంలో పాల్గొన్న ఫొటోలను కూడా వైసీపీ సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారంటే ఆ దిశగా ప్రయత్నాలు జగన్ పార్టీ మొదలు పెట్టినట్లే అనుకోవాల్సి ఉంటుంది

## డాక్టర్ సురేష్ బాబును అభినందించిన వీకోట తెలుగు తమ్ముళ్లు.

**వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 17:**



వీకోట మండల ముద్దుబిడ్డ కుప్పం మాజీ శాసనసభ్యులు దివంగత బిఆర్ దొరస్వామి నాయుడు కుమారుడు డాక్టర్ బి ఆర్ సురేష్ బాబు ను కుప్పంలోని తమ నివాసంలో కలిసి అభినందనలు తెలియజేస్తున్నారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసిన సందర్భంగా డాక్టర్ సురేష్ బాబుకు కుప్పం, పలమనేరు, పుంగనూరు శాసనసభ స్థానాలకు ఇన్చార్జిగా నియమించడంపై వీకోట తెలుగు తమ్ముళ్లు అతనికి శు భాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యా ఎం రంగనాథ్, మండల క్లస్టర్ ఇంచార్జ్ బిఆర్ రాంబాబు, సతీష్ నాయుడు మరియు ఇతర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని గజమాలతో సన్మానించారు.ం

## ఆర్టీసీ స్పెషల్ బాదుడు!

ఎల్లారెడ్డి : ఒకవైపు ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. మరోవైపు ప్రత్యేక రోజుల్లో అడ్డగోలుగా టికెట్ల ధరలు పెంచి అందినకాడికి దోచుకుంటున్నది. ముఖ్యంగా పండుగ సందర్భంగా ఆర్టీసీలో పెరిగిన రద్దీని ముందే పసిగట్టిన అధికారులు.. స్పెషల్ పేరుతో ప్రత్యేక బాదుడుకు తెరలేపారు. పల్లెవెలుగు బస్సులను ప్రత్యేకంగా నడిపిస్తూ ప్రయాణికులను నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. ఎల్లారెడ్డి బస్టాండ్ నుంచి బాలానగర్ వెళ్లడానికి భవానీపేట్ గ్రామానికి చెందిన నవీన్ పల్లె వెలుగు బస్సు ఎక్కాడు. రూ.270 టికెట్ ఇవ్వడంతో ఒక్కసారిగా అవాక్కయ్యాడు. కండక్టర్‌ను ఇదెక్కడి వడ్డింపు అని అడిగినా లాభం లేకుండా పోయింది. సూపర్ లగ్జరీ బస్సుకు రూ.250 ఉండగా.. పల్లెవెలుగు స్పెషల్ బస్సుకు 270 రూపాయలు తీసుకోవడం చాలా ఎక్కువ అని సదరు ప్రయాణికుడు ఆవేదన వ్యక్తంచేశాడు. పండుగల సమయంలో ఆర్టినరీ బస్సులను స్పెషల్ పేరుతో ప్రయాణికుల నుంచి ముక్కుపిండి డబ్బులను వసూలు చేస్తున్న ప్రభుత్వంపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

## ట్రాఫిక్‌లో బెంగుళూరు నగరాన్ని తలపిస్తున్న వీకోట లాంగ్ బజార్



**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఆగస్టు 17:**

వీకోట మండలం, వీకోట పట్టణంలో నడిబొడ్డున ఉన్న ఏకైక ప్రధాన రహదారి ఒక్కటే. వీకోట పట్టణం మూడు రాష్ట్రాల కూడలిలో ఉంటూ ఇటీవల బెంగళూరు టు చెన్నై జాతీయ రహదారి నైస్ రోడ్డు సుందరపాలెం వరకు పూర్తి కావడంతో అట తమిళనాడుకు ఇటు కర్ణాటకకి ప్రయాణ మార్గం సులభతరం మరియు దగ్గర కావడంతో ఈ రెండు నగరాలకు రాకపోకలు రాకపోకలు భారీగా పెరిగిపో వడంతో ఇటీవల కాలంలో వీకోట పట్టణంలో భారీ ట్రాఫిక్ జామ్ అవుతున్నది, పోలీసు వారు ఎంత శ్రమించి ట్రాఫిక్కును క్రమబద్ధీకరిన చేసినా గాని విపరీతంగా కార్లు రావడంతో పాటు, రోడ్డుకి ఇరువైపులా టూవీలర్లు , తోపుడు బండ్లు ఎక్కువ కావడంతో ట్రాఫిక్కు విపరీతంగా అంతరాయం కలుగుతున్నది. కావున సామాన్య ప్రజలకు, ద్విచక్ర వాహనదారులకు, పాదాచారులకు, ఈ ట్రాఫిక్ ఇబ్బందికరంగా మారినది.

బిజినెస్

# రుణగ్రహీతలకు ఎస్బీఐ షాక్

## గృహ రుణాలపై పావు శాతం వడ్డీ పెంపు

**న్యూఢిల్లీ :** దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణ గ్రహీతలకు షాకిచ్చింది. నూతనంగా గృహ రుణాలను తీసుకునేవారికి అధికం భారం మోపుతున్నది. గృహ రుణాలపై వడ్డీరేటును పావు శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయం ఈ నెల 1 నుంచి అమలులోకి వచ్చినట్టు పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో రుణ గ్రహీతల జేబులకు మరిన్ని చిల్లులు పడబోతున్నాయి. ప్రస్తుతం బ్యాంక్ గృహ రుణాలపై %×త్వతీవర్ తీఫ్వ%7.50 శాతం నుంచి 8.70 శాతంగా ఆఫర్ చేస్తున్నది. గతంలో 7.50 శాతం నుంచి 8.45 శాతంగా ఉన్నది. తక్కువ సిబిల్ స్కోర్ ఉండేవారికి అధిక వడ్డీరేటుకు గృహ రుణాన్ని అందించనున్నది. ఈ వడ్డీరేట్ల పెంపు కొత్తగా తీసుకునే రుణాలకు మాత్రమే వర్తించనున్నదని, పాత వాటికి వర్తించదని బ్యాంక్ స్పష్టంచేసింది.




### ఆర్బీఐ వడ్డీంచకపోయినప్పటికీ

రిజర్వుబ్యాంక్ తన పరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ ఎస్బీఐ మాత్రం వడ్డీరేట్లను పెంచడం విశేషం. రెపోరేటును 5.55 శాతంగా ఉంచిన విషయం తెలిసిందే. ఎస్బీఐ తీసుకున్న నిర్ణయంతో ఇతర బ్యాంకులు కూడా గృహ రుణాలపై వడ్డీరేట్లను పెంచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఓవర్‌డ్రాఫ్ట్ ఫెసిలిటీ కలిగిన గృహ రుణంపై వడ్డీరేటు 7.75 శాతం నుంచి 8.95 శాతంగా వసూలు చేస్తున్నది. అలాగే టాప్-అప్ రుణాలపై బ్యాంక్ 8 శాతం నుంచి 10.75 శాతం చొప్పున వడ్డీని వసూలు చేస్తున్నది. ఉదాహరణకు 20 ఏండ్ల కాలపరిమితితో రూ.30 లక్షల గృహ రుణం తీసుకునేవారు 8.45 శాతం వార్షిక వడ్డీతో రూ.25,830 ఈఎంఐలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ వడ్డీరేటు 8.70 శాతానికి పెంచడంతో ఈఎంఐ రూ.26,278కి చెల్లించాల్సివుంటుంది. అంటే నెలకు రూ.450 అదనంగా చెల్లించాల్సివుంటుంది. అంటే మొత్తం గృహ రుణంపై లక్ష రూపాయలు చెల్లించాలి. తక్కువ స్థాయి రుణాలతోపాటు రూ.50 లక్షలకు పైగా రుణాలు తీసుకున్నవారికి కూడా భారం పడనున్నది.

### యూనియన్ బ్యాంక్ కూడా..

మరో ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్ కూడా గృహ రుణాలపై వడ్డీరేటును పది బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో గతంలో 7.35 శాతంగా ఉన్న గృహ రుణాలపై వడ్డీరేటు 7.45 శాతానికి ఎగబాకింది.

### ఎంసీఎల్‌ఆర్‌ని తగ్గించిన పలు బ్యాంకులు

ఎస్బీఐ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఒకవైపు గృహ రుణాలపై వడ్డీరేట్లను పెంచిన బ్యాంక్..మరోవైపు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండింగ్ బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను 5 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఈ నూతన రేట్లు శుక్రవారం నుంచి అమలులోకి వచ్చాయని పేర్కొంది. దీంతో ఒక్కరోజు, నెల కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటు 7.95 శాతం నుంచి 7.90 శాతానికి దించింది. అలాగే నెల రోజుల రుణాలపై వడ్డీరేటు 8.8 శాతం నుంచి 8.75 శాతానికి దించిన బ్యాంక్..రెండేండ్లు, మూడేండ్ల రుణాలపై రేటును 8.85 శాతం నుంచి 8.80 శాతానికి తగ్గించింది. ఎస్బీఐతోపాటు బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ), ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ) కూడా ఎంసీఎల్ఆర్‌ని 35 బేసిస్ పాయింట్ల వరకు కోత పెట్టింది. దీంట్లో బీవోబీ ఎంసీఎల్ఆర్‌ని 35 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. దీంతో నెల రోజుల రుణాలపై వడ్డీరేటు 8.3 శాతం నుంచి 7.95 శాతానికి దించిన బ్యాంక్..ఆరు నెలల రుణాలపై రేటు 8.75 శాతం నుంచి 8.65 శాతానికి, ఏడాది రుణాలపై రేటును 8.8 శాతానికి తగ్గించింది. అంతకుముందు ఇది 8.9 శాతంగా ఉన్నది. అలాగే ఒక్కరోజు, మూడు నెలల రుణాలపై రేటును 15 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో రుణ రేటు 7.95 శాతానికి దిగొచ్చింది. దీంతోపాటు ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ కూడా ఎంసీఎల్ఆర్‌ని 10 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఏడాది రుణాలపై వడ్డీరేటును 8.9 శాతానికి, ఆరు నెలల రుణాలపై రేటును 8.70 శాతానికి తగ్గించింది. జఅలాగే నెల రుణాలపై ఎంసీఎల్ఆర్‌ని 8.3 శాతానికి, మూడు నెలల రుణాలపై రేటును 8.45 శాతానికి తగ్గించింది. మరో ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్‌ని 10 బేసిస్ పాయింట్లు కోత పెట్టడంతో వడ్డీరేటు 8.90 శాతానికి తగ్గింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ మధ్యకాలంలో రిజర్వుబ్యాంక్ రెపోరేటును 100 బేసిస్ పాయింట్లు తగ్గించిన నేపథ్యంలో ఈ ప్రయోజనాన్ని రుణ గ్రహీతలకు అందించాలనే ఉద్దేశంతో బ్యాంకులు ఈ నిర్ణయం తీసుకున్నాయి.

## యమహా నయా స్కూటర్.. గరిష్ఠ ధర రూ.1.02 లక్షలు



**చెన్నై, ఆగస్టు 16:** యమహా దేశీయ మార్కెట్లోకి హైబ్రిడ్ స్కూటర్‌ను పరిచయం చేసింది. 125 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ స్కూటర్ ఐదు రకాల్లో లభించనున్నది. ఫాస్కినో 125 ఎఫ్ఐ హైబ్రిడ్, రేజెడ్ఆర్ 125 ఎఫ్ఐ హైబ్రిడ్‌లు అడ్వాన్స్ స్మార్ట్ ఫీచర్స్, ట్కస్టైలిష్ లుక్‌తో తయారు చేసింది. ఈ స్కూటర్ ప్రారంభ ధర రూ.79,340 నుంచి రూ.1,02,790 ధరల్లో లభించనున్నాయి. స్మార్ట్ మోటర్ జనరేటర్ టెక్నాలజీ, సైలెంట్ స్టార్ట్ అండ్ స్టాప్ సిస్టమ్, నావిగేషన్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది.

## తగ్గనున్న బీమా ప్రీమియం!.. జీఎస్టీని తగ్గించేయోచనలో కేంద్రం




**న్యూఢిల్లీ :** జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ కేంద్ర సర్కార్ తీసుకున్న కీలక నిర్ణయం సామాన్యులకు సైతం భారీ ఊరట లభించబోతున్నది. ఈ నిర్ణయంతో పలు రకాల ఉత్పత్తుల ధరలు తగ్గనుండటంతోపాటు బీమా పాలసీల ధరలు కూడా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్న నరేంద్ర మోదీ సర్కార్..దీనిని 5 శాతానికి కుదించేయోచనలో ఉన్నది. దీంతో ఈ రెండు రకాల పాలసీలు తీసుకున్నవారికి ఆర్థిక ప్రయోజనాలు కలుగడంతోపాటు బీమా ప్రీమియం చెల్లింపులు తగ్గనున్నాయి. బీమా ప్రీమియంలపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించాలని బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ ఇప్పటికే పలుమార్లు కేంద్రానికి సూచించిన విషయం తెలిసిందే. 2047 నాటికి భారతీయులందరికి బీమా ఉండాలనే నినాదంతో ముందుకు సాగుతున్న ఐఆర్‌డీఏఐ..ఈ జీఎస్టీ తగ్గింపు కొంతలో కొంత మేలు చేయనున్నది. బీమా ప్రీమియంపై జీఎస్టీని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించాలని సూచించింది.

### తగ్గిన బీమా వినిమయం

బీమా పరిధిని మరింత విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు చేస్తున్న ప్రయోజనాలు బెడిసికొడుతున్నాయి. గతంలో నాలుగు శాతంగా ఉన్న బీమా వినిమయం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 3.7 శాతానికి పరిమితమైంది. దీంట్లో నాన్-లైఫ్ వినిమయం ఒక్క శాతంగా ఉండగా, లైఫ్ ఇన్సూరెన్స్‌లు 3 శాతంగా నమోదయ్యాయి. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.2, 101 కోట్ల జీఎస్టీని వసూలు చేసిన బీమా సంస్థలు..2023-24 నాటికి రూ.16,398 కోట్ల ఆదాయాన్ని వసూలు చేశాయి.

## గూగుల్‌లో పర్సనల్ ఇంటర్వ్యూలు: సుందర్ పిచాయ్

ఒకప్పుడు ఇంటర్వ్యూ అంటే.. ముఖాముఖి నిర్వహించేవాళ్ళు. టెక్నాలజీ పెరిగిన తరువాత వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూలు చేయడం మొదలైంది. ఈ విధానం ద్వారా ఇంటర్వ్యూలు జరిపితే.. కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. కాబట్టి వర్చువల్ విధానంలో జరిగే ఇంటర్వ్యూలపై గూగుల్ సీఈఓ కీలక వ్యాఖ్యలు చేశారు. వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంటే అభ్యర్థులు కొందరు మోసం చేస్తున్నారు. ఇలాంటి వాటిని నివారించడానికే గూగుల్ కంపెనీలో మళ్ళీ వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు 'సుందర్ పిచాయ్' పేర్కొన్నారు. ఏఐ వినియోగం పెరుగుతున్నందున వర్చువల్ ఇంటర్వ్యూలు సమంజసం కాదని కంపెనీలోని ఉద్యోగులు కూడా డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. వర్చువల్ ఇంటర్వ్యూల ద్వారా.. ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేయడం సులభం. అంతే కాకుండా శ్రమ, వ్యయం కూడా తగ్గుతాయి. అయితే కొందరు మోసం చేయడం మొదలు పెట్టారు. దీనిని దృష్టిలో ఉంచుకునే.. ఇంటర్వ్యూ చేయదలచిన అభ్యర్థిని, కనీసం ఒక్కసారైనా వ్యక్తిగతంగా ఇంటర్వ్యూ చేయాలని నిర్ణయించుకున్నట్లు సుందర్ పిచాయ్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ సమస్య ఎదుర్కొంటున్న కంపెనీల జాబితాలో గూగుల్ మాత్రమే కాకుండా.. అమెజాన్, ఆంత్రోపిక్ , సిస్కో, మెకిన్సే వంటి కంపెనీలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం పరిస్థితులను చూస్తుంటే.. కంపెనీలన్నీ వర్చువల్ ఇంటర్వ్యూ విధానానికి మెల్లగా చరమగీతం పాడేసి, మళ్ళీ వ్యక్తిగత ఇంటర్వ్యూలకే ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంటుందని స్పష్టంగా తెలుస్తోంది.




# బరిలో బుమ్రా!.. ఆసియాకప్ టోర్నీ

స్పోర్ట్స్

### ఆసియాకప్ టోర్నీకి అందుబాటులో శ్రేయాస్, జితేశ్‌కు అవకాశం




ముంబై: ఆసియా కప్ టోర్నీకి భారత జట్టు ఎంపికపై ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి. యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి మొదలయ్యే ఆసియా కప్ కోసం మంగళవారం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బీసీసీఐ సెలెక్షన్ కమిటీ జట్టును ఎంపిక చేయనుంది. అయితే గాయాలతో సహవాసం చేస్తున్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా.. ఆసియా కప్ టోర్నీకి అందుబాటులో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీన్ని మరింత బలపరుస్తూ టోర్నీకి అందుబాటులో ఉండబోతున్నట్లు సెలెక్టర్లకు సమాచారమిచ్చినట్టు జాతీయ వార్తా సంస్థలు తమ కథనాల్లో ప్రముఖంగా పేర్కొన్నాయి. దీంతో వెస్టిండీస్ వేదికగా ముగిసిన టీ20 ప్రపంచకప్ టోర్నీ తర్వాత బుమ్రా మళ్లీ టీమ్‌ఇండియా తరఫున టీ20లు ఆడనున్నాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో ముగిసిన అండర్సన్-టెండూల్కర్ టెస్టు సిరీస్‌లో ముందుగా అనుకున్నట్లుగానే ఐదు మ్యాచ్‌ల్లో మూడింటికే పరిమితమైన బుమ్రా.. ఆసియా కప్‌లో బరిలోకి దిగితే భారత్ పేస్ దళం మరింత పదునెక్కే అవకాశముంది. ఇప్పుడిప్పుడే గాయం నుంచి కోలుకుంటున్న సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ లేని లోటును బుమ్రాతో పూడ్చేందుకు సెలెక్టర్లకు ఇది మంచి అవకాశం. దీనికి తోడు కీలక సమయాల్లో ప్రత్యర్థి బ్యాటర్లకు కళ్లెం వేయడంలో ముందుండే బుమ్రా జట్టులో ఉండటం అదనపు బలం కానుంది. భవిష్యత్ సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని బుమ్రాను సెలెక్టివ్‌గా ఆడిస్తున్న టీమ్ మేనేజ్‌మెంట్ అందుకు తగ్గట్లు నిర్ణయం తీసుకునే చాన్స్ ఉంది. టీ20ల్లో ప్రస్తుతం అర్ష్‌దీప్‌సింగ్ ప్రధాన బౌలర్‌గా కొనసాగుతుండగా, హర్షిత్ రానా కీలకంగా ఉన్నాడు. ఇదిలా ఉంటే ఇటీవలి ఐపీఎల్ ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుంటే హైదరాబాదీ స్పీడ్‌స్టర్ మహమ్మద్ సిరాజ్‌తో పాటు ప్రసిద్ధ్ కృష్ణ బెర్తులు దక్కించుకునే అవకాశాలను కొట్టిపారేయలేం. మొత్తంగా స్లో పిచ్‌లకు చిరునామా అయిన యూఏఈలో బౌలింగ్ కాంబినేషన్‌పై ఆసక్తి నెలకొన్నది.


### శ్రేయాస్, జితేశ్‌కు చాన్స్:

ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన శ్రేయాస్ అయ్యర్, జితేశ్‌శర్మ తిరిగి టీమ్‌ఇండియా టీ20 జట్టులోకి వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఐపీఎల్‌లో పంజాబ్ జట్టును అయ్యర్ ముందుండి నడిపిస్తే లోయార్డర్‌లో ధనాధన్ బ్యాటింగ్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) 18 ఏండ్లలో తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలువడంలో జితేశ్ కీలకంగా వ్యవహరించాడు. ఒకవేళ వీళ్ల ఇద్దరిని టీమ్‌కు ఎంపిక చేస్తే అదే సమయంలో ఆల్‌రౌండర్ శివమ్‌దూబె, హార్డ్‌హిట్టర్ రింకూసింగ్‌ను పక్కకు తప్పించాల్సి ఉంటుంది. స్పిన్ బౌలింగ్‌లో ధాటిగా ఆడటంలో దిట్ట అయిన శివమ్ దూబెతో శ్రేయాస్‌కు పోటీ నెలకొన్నది. తనదైన రోజున ప్రత్యర్థి ఎవరన్నది లెక్కచేయని నైజంతో దూకుడుగా ఆడటంలో శ్రేయాస్ ముందంజలో ఉంటాడు. మరోవైపు సంజూ శాంసన్‌కు రిజర్వ్ వికెట్‌కీపర్‌గా వ్యవహరిస్తున్న ధృవ్‌జురెల్‌ను తప్పించి అతని స్థానంలో జితేశ్‌ను తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కీలకమైన లోయార్డర్‌లో ఆఖరి వరుస బ్యాటర్లతో కలిసి దూకుడుగా ఆడటంలో జురెల్ కంటే జితేశ్ ఒకింత ముందున్నాడు.

### గిల్, జైస్వాల్ వచ్చేనా!

శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ టీ20 టీమ్‌లోకి రావడంపై సందిగ్ధత నెలకొన్నది. ఈ మధ్యే ఇంగ్లండ్‌తో ముగిసిన ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో మెరుగ్గా రాణించిన గిల్, జైస్వాల్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. ఒకవేళ ఆసియా కప్ టీమ్‌కు గిల్, జైస్వాల్‌ను పరిగణనలోకి తీసుకుంటే కొద్ది రోజుల తేడాతో స్వదేశం వేదికగా వెస్టిండీస్‌తో మొదలయ్యే టెస్టు సిరీస్‌కు ఎక్కువ సమయం దొరకకపోవచ్చు. సెప్టెంబర్ 28తో ఆసియా కప్ ముగుస్తుండగా, అక్టోబర్ 2 నుంచి అహ్మదాబాద్‌లో విండీస్‌తో తొలి టెస్టు మొదలుకానుంది. ఈ నేపథ్యంలో రానున్న సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని టెస్టు టీమ్‌లో కీలకమైన గిల్, జైస్వాల్‌ను ఆసియా కప్‌నకు ఎంపిక చేయకపోవచ్చనే వార్తలు వెలువడుతున్నాయి. మొత్తంగా మంగళవారం జరిగే సెలెక్షన్ కమిటీ సమావేశం ద్వారా వీటన్నింటికి సమాధానం దొరకనుంది. చీఫ్ కోచ్‌గా గౌతం గంభీర్ పగ్గాలు చేపట్టిన తర్వాత జరిగిన 15 టీ20ల్లో టీమ్‌ఇండియా 13 విజయాలు సొంతం చేసుకుంది. దీనికి తోడు వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వనున్న క్రమంలో ప్రస్తుత కోర్‌టీమ్‌లో భారీ మార్పులు ఉండకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

### ఆసియాకప్‌లో టీమిండియాపై విజయం మాదే: పాక్ క్రికెట్ డైరెక్టర్



ఆసియాకప్-2025 కోసం పాకిస్తాన్ క్రికెట్ బోర్డు తొలి అడుగు వేసింది. ఈ మెగా టోర్నీకి 17 మంది సభ్యులతో కూడిన జట్టును పీసీబీ ప్రకటించింది. ఈ జట్టు కెప్టెన్‌గా సల్మాన్ అలీ అఘా ఎంపికయ్యాడు. అదేవిధంగా స్టార్ ప్లేయర్లు బాబర్ ఆజం, మహ్మద్ రిజ్వాన్‌లపై సెలక్టర్లు వేటు వేశారు. అయితే జట్టు ప్రకటన అనంతరం విలేకరుల సమావేశంలో పాల్గోన్న పాకిస్తాన్ క్రికెట్ జట్టు హై-పెర్ఫార్మెన్స్ డైరెక్టర్ ఆకిబ్ జావేద్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఆసియాకప్‌లో భారత జట్టును ఓడించే సత్తా పాక్‌కు ఉందని జావేద్ అభిప్రాయపడ్డాడు. జట్టులోని ప్రతీ ఆటగాడు టీమిండియా విసిరే సవాల్‌కు సిద్ధంగా ఉన్నారని ఈ పాక్ మాజీ పేసర్ తెలిపాడు. కాగా పాకిస్తాన్‌పై టీ20ల్లో భారత్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. కానీ పాక్ జట్టు మాత్రం ఆసియా కప్-2022లో విజయాన్ని పునరావృతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు ఇరు జట్లు 13 మ్యాచ్‌లలో ముఖాముఖి తలపడగా.. భారత్ తొమ్మిది మ్యాచ్‌ల్లో విజయం సాధించగా, పాకిస్తాన్ మూడు మ్యాచ్‌ల్లో గెలుపొందింది. పాక్ చివరగా దుబాయ్‌లో జరిగిన 2022 ఆసియా కప్ సూపర్ ఫోర్‌లో భారత్‌పై టీ20 విజయం సాధించింది. "పాకిస్తాన్ టీ20 జట్టు టీమిండియాను ఓడించగలదు. భారత్-పాకిస్తాన్ మ్యాచ్ అంటే భారీ అంచనాలు ఉంటాయి. కానీ మేము ఎంపిక చేసిన ఈ 17 మంది సభ్యుల జట్టు ఏ టీమ్‌నైనా ఓడించగలదు. అయితే వారిపై మేము ఎటువంటి ఒత్తిడి తీసుకురావడం లేదు. ఈ జట్టుపై నాకు చాలా నమ్మకం ఉంది.

### ఆసియాకప్ రేసులో గిల్ కంటే అతడే ముందున్నాడు: అశ్విన్




ఆసియాకప్-2025 టీ20 టోర్నీ సెప్టెంబర్ 9 నుంచి యూఏఈ వేదికగా ప్రారంభం కానుంది. ఈ మార్క్యూ ఈవెంట్ కోసం భారత జట్టును అజిత్ అగర్కార్ నేతృత్వంలోని బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఒకట్రెండు రోజుల్లో ప్రకటించే అవకాశముంది. అయితే ఈ టోర్నీకి భారత జట్టులో యవ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు చోటు ఇవ్వాలని లెజెండరీ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ సూచించాడు. కాగా టీమిండియా హెడ్‌కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టాక టీ20 ఫార్మాట్‌లో ఓపెనర్లగా అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ కొనసాగుతున్నారు. చాలా టీ20 మ్యాచ్‌లకు జైశ్వాల్‌కు విశ్రాంతి ఇచ్చారు. ఇప్పుడు ఆసియాకప్‌నకు జైశ్వాల్‌తో పాటు మరో ఓపెనర్ శుబ్‌మన్ గిల్ కూడా ఉన్నాడు. దీంతో భారత జట్టులో ఎవరికి చోటు దక్కుతుందన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. "ఆసియాకప్ జట్టు ఎంపిక గురించి కొన్ని చర్చలు జరుగుతున్నాయి. టీ20 ప్రపంచకప్‌లో యశస్వి జైస్వాల్ బ్యాకప్ ఓపెనర్‌గా ఉన్నందున, శుబ్‌మన్ గిల్‌ను టీ20 ప్రణాళికలకు సరిపోతాడా లేదా అన్నది ఇప్పుడు అందరి మనస్సులను తొలుస్తున్న ప్రశ్న. నావరకు అయితే సెలక్టర్లు గిల్ కంటే జైశ్వాల్‌కే తొలి ప్రాధాన్యత ఇస్తారని అనుకుంటున్నాను. రోహిత్ శర్మ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించడంతో ఆ స్దానంలో జైశ్వాల్ ఆటోమేటిక్‌గా లభిస్తుంది. అభిషేక్ శర్మ స్దానానికి ఎటువంటి ఢోకా లేదు. ఇప్పుడంతా మరో ఓపెనర్ కోసమే చర్చ. శుబ్‌మన్ గిల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అదేవిధంగా సంజూ శాంసన్ కూడా ఓపెనర్‌గా అద్భుతంగా రాణించాడు. కాబట్టి సెలెక్టర్లకు కష్టమైన పరిస్థితి" అని ఎక్స్‌ప్రెస్ స్పోర్ట్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అశ్విన్ పేర్కొన్నాడు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143